




*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మాయి మనసు

"మూడువేలు ఇవ్వు"

ఆఫీస్ కేంటిన్‌లో కూర్చుని బాక్స్‌లో అన్నం తింటున్న నేను తలెత్తి చూసాను. అక్క. మౌనంగా బేగ్‌లోంచి మూడువేల రూపాయలు తీసి టేబుల్ మీద పెట్టాను. గమ్ నములుతున్న అక్క వాటిని నిర్లక్ష్యంగా తీసుకుని, నావైపు హేళనగా చూసి వెళ్ళిపోయింది.

అక్కకి నామీద వైరభక్తి.  నేనంటే ఇష్టంలేదు. నన్ను చూడకుండా ఉండలేదు. ఈ వంక పెట్టుకుని నన్ను చూడడానికి వస్తూంటుంది. నిజానికి నా జీతం కన్నా తన జీతం చాలా ఎక్కువ. సంవత్సరానికి దాదాపు ఏభై లక్షలు.

మా మధ్య గొడవకి కారణం మా బావ. మా మేనత్త కొడుకు. అక్క బావని ప్రేమించింది. కాని దురదృష్టవశాత్తూ తను బావకంటే రెండు నెలలు పెద్ద. నేను అక్క కంటే రెండేళ్ళు చిన్న.

మా పెళ్ళి ప్రస్థావన వచ్చినప్పుడు అక్క బావనే చేసుకుంటానని పట్టుబట్టింది. కాని అత్తయ్య ఒప్పుకోలేదు.

"మాకున్నది ఒక్కడే. వాడికన్నా పెద్దదాన్నిచ్చి చేస్తే ఆయుక్షీణం. నేనొప్పుకోను" ఖరాఖండీగా చెప్పింది.

అమ్మా నాన్నలు అర్థించినా వాళ్ళు వినలేదు. 'అంతగా అడుగుతున్నావ్ కాబట్టి చిన్నదాన్ని చేసుకుంటాం' అని ఆ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టారు.

అది తెలిసి అక్క కోపం నావైపు తిరిగింది.

"బావని చేసుకుంటే నీకు విషం పెట్టి చంపేస్తా" అన్ను హెచ్చరించింది.

రిజిస్టర్ మేరేజ్ చేసుకుందామని బావని బతిమాలింది కాని, పెద్దవాళ్ళ మనసు నొప్పించడానికి అతను ఒప్పుకోలేదు. దాంతో అక్క పెళ్ళి కాకుండానే మా పెళ్ళి జరిగిపోయింది. అక్క బెంగుళూర్‌లో ఆఫీస్ పని అని వెళ్ళిపోయింది. పెళ్ళికి రాలేదు.

నేను, బావ ఉంటున్న ఫ్లాట్‌కి దగ్గర్లో ఉన్న తన ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయింది. అమ్మానాన్నలతో కూడా మాట్లాడడం మానేసింది. అమ్మే అప్పుడప్పుడు ఫోన్ చేసి, యోగక్షేమాలు అడిగి, పెళ్ళి చేసుకోమని కోరి, చివాట్లు తింటూంటుంది.

వయసులో తేడా ఉన్నా అక్క చెల్లెళ్ళుగా కంటే స్నేహితులుగా మసలే మమ్మల్ని మా పెళ్ళి విడదీసింది. అక్క చెప్పింది నిజమే. నేనీ పెళ్ళి చేసుకుని ఉండకూడదు. కానీ పెద్దవాళ్ళ బలవంతం, బావమీదున్న అభిమానం, అన్నిటికన్నా చదువులో, తెలివితేటల్లో, సంపాదనలో నాకంటే ఎక్కడో పై మెట్టుమీద ఉన్న అక్కని ఈ పెళ్ళితో ఓడించాననే సేడిస్టిక్ ప్లెజర్ కోసం నేను బావని పెళ్ళి చేసుకున్నాను.

మా ఇద్దరి ఆఫీస్ బిల్డింగ్స్ దగ్గర్లో ఉన్నాయి. అందుకే అక్క అప్పుడప్పుడు నన్ను చూడడానికి వచ్చి, కారణం లేదు కాబట్టి డబ్బడుగుతూంటుంది.

"ఐదువేలు కావాలి" అన్నం తింటున్న నేను తలెత్తి చూసాను. అక్క కనబడి నెలదాటుతోంది. ఈ మధ్యలో చాలాసార్లు అనుకున్నాను.

"నెల దాటింది" చెప్పాను.

"అవును. సింగపూర్‌లో చిన్న ప్రాజెక్ట్ పనిమీద వెళ్ళాను. ఐతే నాగురించి ఆలోచించావన్నమాట" నవ్వింది.

"రక్తసంబంధం మరి" హేండ్ బేగ్ తెరుస్తూ చెప్పాను.

ఐదువేలు తీసి అక్కవైపు చూస్తే, అక్క నావైపు తదేకంగా చూస్తోంది. కళ్ళల్లో పల్చటి నీటి తెర.

డబ్బు తీసుకోకుండానే అక్క లేచి వెళ్ళిపోయింది.

“కేంటీన్‌లో మసాలా ఘుమఘుమలు నిండివుంటే నువ్వేంటీ చల్లారిపోయిన పొట్లకాయకూర తింటున్నావు?" పదిరోజుల తర్వాత కన్పించిన అక్క అడిగింది.

"పొదుపు" నవ్వి బాక్స్ మూత మూసేసాను.

"సరే. ఈసారి వెయ్యి రూపాయలు ఇవ్వు చాల్లే. పెద్దదానిలాగా ఆ చీర ఏంటి? కనీసం చుడీదార్ ఐనా వేసుకోవచ్చుగా?"

అక్కవైపు చూసాను. జీన్స్ మీద తెల్లటి కుర్తా. భుజాల దాకా కత్తిరించిన జుట్టు. నా చెల్లెల్లా ఉంది.

మాట్లాడకుండా పర్స్‌లోంచి వెయ్యి రూపాయలు తీసిచ్చాను.

"పదివేలు కావాలి" పదిహేను రోజుల తర్వాత వచ్చిన అక్క అడిగింది.

"పదివేలా?"

కవ్విస్తున్నట్లుగా చూసి నా ఎదురు కుర్చీ లాక్కుని కూర్చుంది.

నేను మౌనంగా బేగ్ తెరిచాను. అక్క విలాసంగా వెనక్కి వాలి కాఫీ ఆర్డర్ చేసింది.

"నాన్నకి ఈ మధ్య బావుండట్లేదు. మొన్నే ఊరు వెళ్ళొచ్చాం" బెరుగ్గా చెప్పాను.

అక్క మాట్లాడకుండా చెయ్యి చాచింది. నేను డబ్బు తన చేతిలో పెట్టాను.

ఖాళీ కప్పు తీసుకోడానికి వచ్చిన వెయిటర్‌ని చూసి అక్క తన చేతిలోని పదివేలని సాసర్‌లో పెట్టి చెప్పింది.

"నీకు టిప్. కాఫీ బావుంది."

అతను అనుమానంగా చూస్తూ దాన్నందుకుని ఆనందంగా వెళ్ళిపోయాడు.

"ఏం చేస్తున్నావ్ అక్కా?" అసంకల్పితంగా నా స్వరం పెరిగింది.

"నా ఇష్టం" మా అక్క కవ్వింపుగా నవ్వుతూ చెప్పింది.

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నా గురించి ఆలోచించవా?" రుద్ధ కంఠంతో అడిగాను.

అక్క పకపక నవ్వి అడిగింది.

"పదివేలకేనా ఆ ఏడుపు?"

"అవును. దాన్ని కప్పి పుచ్చడానికి నేను ఎంత శ్రమ పడాలో నీకు తెలుసా? ఎన్ని ఎడ్జస్ట్‌మెంట్స్ చేయాలో తెలుసా?" ఉక్రోషంగా అడిగాను.

అక్క ప్రశ్నార్ధకంగా చూసింది.

"నువ్వు పెళ్ళిచేసుకుందామనుకుని వెంటపడి, ఇప్పటిదాకా మోడుగా ఉన్నావే. ఆ బావగారు ఎంత పిసినారో తెలుసా? ఆయనకి పైసా పైసా లెక్కే. నీకిచ్చే డబ్బు ఫోన్ పే చేయకుండా కేష్ ఎందుకిస్తున్నానా అని ఆలోచించావా? మనిద్దరం ఒక ఫ్లాట్‌లో ఉండి, విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసిన కాలం కాదు. అన్నిటికీ లెక్క చెప్పాలి. ఇంటికి వెళ్ళగానే నా ఫోన్ తీసుకుని అన్ని ఎంట్రీలు చూస్తాడు. అనుమానం వస్తే అడుగుతాడు. ఈ తల నొప్పి ఎందుకని కేంటిన్ ఖర్చులని కొంత కేష్ డ్రా చేస్తున్నా. ఘుమఘుమలాడే కేంటిన్‌లో చల్లారిపోయిన పొట్లకాయ కూర తింటున్నా" ధారగా కారే కన్నీటిని పైట చెంగుతో తుడుచుకుంటూ చెప్పాను.

"అత్తయ్య పెళ్ళయిన వెంటనే నా డ్రెస్‌లు మూటకట్టి పడేసింది. లక్షణంగా చీర కట్టుకోవాలిట. నా మొగుడు దానికి తందానా తానా."

అక్కయ్య కళ్ళలో వెలుగు. అది ముఖమంతా పాకింది.

"నిజమా?" అడిగింది.

"అబద్ధాలకి కన్నీళ్ళు వస్తాయా?"

అక్క లేచి వెళ్ళిపోయింది.

అక్క మా ఊరు వెళ్ళిందని, ఆఫీస్‌లో తనకి ప్రపోజ్ చేసిన అబ్బాయితో పెళ్ళి చేయమని అడిగిందని అమ్మ చెప్పింది.

బావ గురించి చెప్పిన చిన్న అబద్దం అక్క మనస్సు మార్చింది. నిజానికి లావైపోతున్నానని నేను సాత్వికాహారం తింటున్నాను.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments